పాపకు సుబ్బులక్ష్మి అని పేరు పెట్టారు.

సుశీల కాపేరు నచ్చలేదు. కాని తన్నెవరూ అడగలేదు. తానయినా ఏ పేరు నిశ్చింతగా అనుకోలేదు. కానీ ఇప్పుడు పెట్టిన పేరు ఎంతమాత్రం నచ్చలేదు ఆమెకు. తన్నడగకపోతే మానె. కనీసం వాళ్ళయినా ఆలోచించి మంచిపేరు పెట్టలేక పోయారేమిటి?

"అందునాటిలో లేని అభిరుచుల్ని నేర్చుకోలేము. ఇలాంటి విషయాల్లోనయినా మన ఇష్టానుసారం ఉండకూడదటండీ?" భర్త నడిగింది సుశీల.

"ఎందుకుండకూడదు?" రఘుపతి మామూలుగానే అన్నాడు. తన బాధ అతడి కర్థం కాలేదు. అతడెప్పుడూ అంతే. అతడు మనిషిని చూస్తాడేకాని మనసుని చూడడు. మాటలు వింటాడేకాని మమతను గుర్తించడు. అతడు మంచివాడే. తన్ను నిర్లక్ష్యం చేయాలన్న అభిప్రాయమే లేదతడికి. కాని తన భావాలేమిటో, తన అభిరుచి ఏమిటో అని గుర్తించకపోతే జీవించడ మెలాగ?

"నీకేం పేరు పెట్టాలని నన్నెప్పుడయినా అడిగారా?"

"ఏ పేరయితేనేమిటి?"

"నేను! ఒసే అన్నా పలుకుతున్నాను. ఏమే అన్నా పలుకుతున్నాను. సుశీ అన్నా, సుశీలా అన్నా పలుకుతున్నాను. . . అత్తగారు 'శాంతమ్మా' అని ముసిలి వాళ్ని పిలిచినట్లు పిలిచినా పలుకుతున్నాను. . . ."

"కాకపోతే పేరులో ఏముంది?"

"నిజమే పేరులో ఏముంది? సుశీ అన్నా సుబ్బలక్ష్మీ అన్నా, మంజీరా అన్నా మంగమ్మా అన్నా ఒకటే. ఆ గొంతులో మమత ఉండాలి కానీ. కీ ఇచ్చిన బొమ్మ సుధా అంటేనేమి సుబ్బులూ అంటేనేమి? అది హృదయంలేని బొమ్మ. ప్రాణంలేని బొమ్మ, మమతలేని బొమ్మ. మట్టిబొమ్మ. . ." సుశీలకళ్ళు చెమ్మగిల్లాయి.

రఘుపతికి ఆఫీసుకి వేళయింది. అమ్మ భోజనానికి పిలిచింది వడ్డించి.

భోజనం చేసి ఆఫీసుకు పోయేముందు "ఆముదం పెద్ద సీసా తెచ్చేదా? చిన్నసీసా తెచ్చేదా?" అని అడిగాడు సుశీలను.

చిన్నది చాలునంది సుశీల.

అతడు వెళ్ళిపోయాడు.

• •

సుబ్బులక్ష్మికి పుట్టిన పండుగ.

పేరంటానికి వచ్చిన ఎవరో "పాప పేరేమిటి?" అని అడిగారు. "బుజ్జి" అంది సుశీల.

"బుజ్జి ఏమిటమ్మా సుబ్బులక్ష్మి అని చెప్పకుండా?" నూకాలమ్మగారు కోడల్ని మందలించింది.

ఆ వచ్చినావిడ "సుబ్బులక్ష్మి అంటే? . . . ." నూకాలమ్మగారిని చూసింది దీర్ఘంతీస్తూ.

"మా అత్తగారిపేరు. . . ." నూకాలమ్మ వివరించడం మొదలెట్టింది. "ఆవిడ ఈ ఇంట్లో మహాలక్ష్మిలా వెలిసింది. ఎన్ని వ్రతాలు! ఎన్ని నోములు! అరుంధతి అనుకోండి. . . .అన్నపూర్ణ అనుకోండి. . . ఆ పేరులో ఓ అక్షరం పండినాచాలు."

"శానమ్మా ఆ అదృష్టంలో శతాంశం ఉన్నా చాలు. . . .అయినా అదంతా ఎవరికి కావాలిప్పుడు? ఒట్టి అప్రాచ్యపు పేర్లు. అపభ్రంశపు తీరులూ. . ."



సుశీల కావిడ తీరేమీ నచ్చలేదు.

నూకాలమ్మ తన కోడలికి పెట్టిన అత్తవారింటి పేరు 'శాంతమ్మ'. ఆవిడ పొరపాటునకూడా "సుశీలా?" అని పిలవదు. పోనీ అత్తవారింటి పేరుతోనయినా "శాంతా" అని పిలవదు. పూర్తిగా "శాంతమ్మా" అనే పిలుస్తుంది.

"మీరు పెద్దవారత్తయ్యా, నన్ను 'శాంతా' అని పిలిస్తే చాలు" అంది ఒకసారి సుశీల.

"అలా కాదు శాంతమ్మా, మనది పూర్వం పరగణాలు ఏలిన కుటుంబం. చిన్నయినా పెద్దయినా గౌరవంగానే పిలవాలి" అని యుక్తిపూర్వంగానే పిలిచేది.

ఆరంభంలో రఘుపతిని తన్ను ఆర్ద్రంగా "సుశీ" అని పిలవమని అడిగింది సుశీల. అతడు "సుశీ" అని పిలుస్తాడే కాని ఆ ఆర్ద్రత సంగతి మాత్రం అతడికి చేత కాలేదు. అసలు పేరులో ఏముందని పించిదాతడి వాలకం చూచిన సుశీలకు.

కానీ తను శాంతమ్మగాను తన పాప సుబ్బులక్ష్మమ్మగాను పిలవబడడం ఆవిడకేమీ నచ్చలేదు.

• • • •

సుబ్బులక్ష్మమ్మకు తమ్ముడు పుట్టాడు. నామకరణ ముహూర్తం వచ్చింది. ఏం పేరు



పెట్టాలని ప్రశ్న. నిర్ణయం చేసేవాళ్ళెవరు?

నూకాలమ్మగారుంటే ఈ సమస్య ఉండేదేకాదు. రఘుపతి అయినా, పురోహితుడయినా వెంటనే ఆవిడను అడిగేవారు. ఆవరకే అనుకొన్న పేరు వెంటనే ఆవిడ చెప్పేసేది. నామకరణం జరిగిపోయేది.

కానీ నూకాలమ్మగారిప్పుడు లేరు.

ఆవిడ పరమపదించారు.

కొడుక్కి మంచిపేరు పెట్టాలని రఘుపతి ఆలోచించడం మొదలెట్టాడు.

అంత్యకాలంలో నామస్మరణచేత మోక్షం వస్తుందని గొప్పవాళ్ళ పేర్లు పెడతారట. . . .పెద్దవాళ్ల పేర్లు పెడితే వాళ్ళ ఆశీస్సు మేకాదు ఆయుస్సు కూడా వస్తుందట. . . .ఇవన్నీ నమ్మి ఎమ్మికాలేనేమో. . . . ఇంతకీ సుశీల ఏమంటుందో? దానికు మంచి అభిరుచులు లేవని ముందే అన్నది. సరే ఈసారి అబ్బాయి పేరు విషయం సుశీలకే వదిలేయాలి. . . .నిజంగా సుశీలకు మంచి అభిరుచులున్నాయి. ఎంతో చక్కనిపేరు చెబుతుంది. ఒకవేళ ఏమయినా కొన్ని పేర్లు చెప్పమని తన్నే అడిగితే? మంచిపేర్ల జాబితా తయారు చేసుకొని

# నామకరణం



— కె. వి. ఆచార్య

సుశీల దగ్గిరికి వచ్చాడు రఘుపతి.

"ఇలా చూడు, అబ్బాయి పేరు విషయం. . ."

"శాను నేనెప్పుడో అనుకొన్నాను."

"ఏమనుకొన్నావు?"

"మీరు కాదనకూడదు."

"నీ ఇష్టం. అమ్మ లేదుగా."

"అందుకే. . . . ."

"నీకు నచ్చినపేరు చెప్పు. కానీ బావుండాలి."

"అయితే బాబు పేరు నూకాలయ్య." వెంటనే చెప్పింది సుశీల.

"అదేమిటి!" నమ్మలేకపోయాడు రఘుపతి.

"శాను అత్తయ్యగారుంటే ఎంతో బావుండేది. వారి పేరయినా మన మధ్యన ఉండాలి. . ." సుశీల కళ్ళల్లో నీళ్ళున్నాయి.

"సుశీ!" రఘుపతి గొంతులో గుండె తొంగిచూసింది.

"శాను ఈ సంసారం కోసం ఆవిడ గంధపుచెక్కలా అరిగిపోయింది. ఆవిడ ఋణం ఇంకేలాగూ తీర్చుకోలేము." ఆవిడ మాటల వెనక మమత వెల్లువయింది.

రఘుపతి మనసు పువ్వయింది.

సుబ్బులక్ష్మి నవ్వింది.

నూకాలయ్య నవ్వేడు.

నామకరణోత్సవం మహా వైభవంగా జరిగిపోయింది. ★